క్లుప్తంగా

రైతుబజార్ కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం: రూ. టమోటా 75, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 85, కాకర 45, బీర 40, క్యాలిఫ్లవర్ 28, క్యాబేజీ 17, క్యారెట్ 47, దొండ 28, ఆలు 21, ఉల్లి 17, గోకర 35, దోస 15, సొర 13, పొట్ల 23, అరటి 11, చిక్కుడు 85, అర్వి 35, మునగ 35, చిలగడదుంప 45, బీట్‌రూట్ 31, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 95, క్యాప్సికం 60. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

డ్రైనేజీ వ్యర్థాలను తరలించాలి

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపుర డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తీసిన డ్రైనేజీ వ్యర్థాలను తరలించకపోవడంతో దుర్గంధంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శికాలనీ తదితర కాలనీలలో డ్రైనేజీ శుభ్రం చేసిన సిబ్బంది అందులోంచి తీసిన వ్యర్థాలను రోడ్డుపైనే వదిలేస్తున్నారు. అందులోంచి వచ్చే దుర్వాసనతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీలోంచి తీసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఈద్గాలలో సౌకర్యాలు కల్పించాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మసీఉల్లా ఖాన్

చంచల్‌గూడ: బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక నమాజ్‌కు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మసీఉల్లాఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన యాకత్‌పురా ఎమ్మెల్యే పాషాఖాద్రీతో కలిసి మాదన్నపేట ఈద్గాలో ఏర్పాట్లను పరిశీలించారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, పోలీసు, ట్రాఫిక్ సిబ్బందితో బక్రీద్ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా



దిల్‌సుఖ్‌నగర్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో నారాయణ హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి ఓపెన్ క్యాటగిరిలో నాగిరెడ్డి బాలజీ రెడ్డి 9వ ర్యాంకు సాధించాడని, 3000లోపు 32 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి ప్రతిభ కనబరిచారని నారాయణ హైస్కూల్ ఎల్‌బీనగర్ సీఓ స్కూల్ డీన్ మదనాచారి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఓపెన్‌టాప్ జీపులో ఊరేగించారు. ఈ సందర్భంగా మదనాచారి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడ్పాటుతో లక్షల మందితో మేటిగా నిలిచారని తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం

● దేప భాస్కర్ రెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు వాదే ముస్తఫా బస్తీలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు తదితర సమస్యలను స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని అనుకొని ఉన్న వాదే ముస్తఫా బస్తీలో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని రహదారులుండడం బాధాకరమన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు ఈ బస్తీలను చూసి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇళ్ల ముందు పారుతున్న మురుగుతో ఇక్కడి బస్తీవాసులు వర్షాకాలంలో అంటువ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వాపోయారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యూసుఫ్ ఖాద్రీ, ఎం.ఎ.బారీ, మన్న రవి కుమార్, ధన్‌రాజ్ గౌడ్, పున్న గణేష్, ఫజిల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



వాదే ముస్తఫాలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న దేప భాస్కర్ రెడ్డి

వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రజయ్ నివాస్ ఫేస్-1లో భవిష్యత్ ఎలాంటి వరద నీటి సమస్యలు ఉండవని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కొత్తపేట డివిజన్ ప్రజయ్ నివాస్ ఫేస్-1లో సోమవారం ఆయన పర్యటించారు. పై నుంచి వచ్చే వరదనీటి ప్రవాహంతో సరైన ఔట్‌లేట్ లేకపోవడంతో వరద వచ్చి చేరడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని శాశ్వత పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని వరదనీరు రాకుండా పక్కనే స్ట్రామ్ వాటర్ లైన్ వేయడం జరుగుతుందన్నారు. దాదాపు 150 మీటర్ల మేర నూతన లైన్ వేస్తారని ఈ పనులు పూర్తయితే ఎలాంటి వరద నీటి సమస్యలు ఉండవన్నారు. ఎమ్మెల్యే వెంట రాహుల్ గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్వేతారెడ్డి, చంద్రోఖర్ రెడ్డి, సాయి గౌడ్, శరీన్, మలాతి, రామారావు, ప్రసాద్, లింగేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం



పాఠశాలల బంద్ కార్యక్రమంలో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు

చైతన్యపురి: ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం ఎల్‌బీనగర్ విభాగ్‌లోని పాఠశాలల బంద్ విజయవంతం అయిందని రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ, రాష్ట్ర కార్య సమితి సభ్యులు అక్కారి మహేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ లేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునే పరిస్థితి దారుణంగా తయారైందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్, నాయకులు గంగాధర్, శివ, జగదీశ్వరి పాల్గొన్నారు.

సంగీతం ఆరోగ్యానికి ఔషధం లాంటిది



నూకల ప్రభాకర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నాగోలు: సంగీతం ఆరోగ్యానికి ఒక ఔషధం లాంటిదని ప్రఖ్యాత సినీ వ్యాఖ్యాత ఎస్‌వీ రామారావు అన్నారు. న్యూ నాగోల్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో స్వరఝరి కల్చరల్ అసోసియేషన్ సౌజన్యంతో బాల సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామారావు మాట్లాడుతూ.. ప్రతి మనిషిలోనూ ఒక గాయకుడుంటాడని తెలిపారు. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పాడిన పాట లు ఎంతో అమోఘం అన్నారు. సీనియర్ సిటిజన్ ఇలాంటి కార్యక్రమం నిర్వహించి మర్చిపోతున్న ఎన్నో సినీ గీతాలను మరోసారి గుర్తుకు చేశారని అన్నారు. న్యూ నాగోల్ కాలనీలో ఘంటసాల జీవిత సాఫల్య పురస్కార గ్రహీత నూకల ప్రభాకర్ ఘంటసాల గురించి ఒక పరిశోధన చేసి ప్రతి బుధవారం తన స్టూడియో నుంచి ఎంతో మంది గాయనీగాయకులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం నూకల ప్రభాకర్‌ను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యశ్వంత రావు, పన్నాల శ్రీరాములు, పరశురామ్, పరమట రెడ్డి, కేవీ సుబ్బారావు, ప్రేమసదాశివన్, గాయత్రి, జ్ఞాన కుమార్, మధుసూదన్ రెడ్డి, యశ్వంత రావు, తిమ్మారెడ్డి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. సోమవారం హస్తినాపురంలోని వివేకానందనగర్ కాలనీలో కాలనీవాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలోని కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం కాలనీవాసులు స్వచ్ఛందంగా నిధులు సేకరించి పనులు చేసినా పూర్తి కాలేదని, మిగతా పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తానని అన్నారు. కాలనీలో అర్ధంతరంగా నిలిచి పోయినా రోడ్డు పనులు సైతం పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని సుజాతనాయక్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షులు కుమార్, మధుసూదన్‌రెడ్డి, హనుమంత్‌నాయక్, భీమయ్య, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్మిషన్లకు క్యూ



● ఇప్పటికే మొదటి సంవత్సరంలో 118 మంది విద్యార్థులు చేరిక
● చకచకా సాగుతున్న భవన నిర్మాణ పనులు

మీర్‌పేట: జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల కోసం విద్యార్థులు క్యూ కడుతున్నారు. మీర్‌పేటతో పాటు అల్మాస్‌గూడ, బడంగ్‌పేట, నాదర్‌గుల్, బాలాపూర్ పరిసర ప్రాంతాల నుంచి గతంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం నగరంలోని సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో చేరి అధిక ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడేవారు. స్థానికంగా ఉండే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ గత విద్యా సంవత్సరం మీర్‌పేట సిర్లాహిల్స్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జూనియర్ కళాశాల నిర్మాణం చేపట్టింది. దీంతో గత విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అధిక సంఖ్యలో మొదటి సంవత్సరంలో విద్యార్థులు చేరారు.

233 మంది విద్యార్థులు..

ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులు అధిక సంఖ్యలో అడ్మిషన్లు తీసుకున్నారు. మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం ఎంపీసీ గ్రూప్-28, బైపీసీ-14, సీఈసీ-53, ఎంఎల్‌టీ-07 విద్యార్థులు, అలాగే, తెలుగు మీడియం ఎంపీసీ-01, బైపీసీ-03, సీఈసీ-07, ఎంఎల్‌టీ-5 మంది విద్యార్థులు చేరారు. ఇప్పటి వరకు అన్ని గ్రూపులకు సంబంధించి 118 మంది విద్యార్థులు నూతనంగా అడ్మిషన్లు తీసుకున్నారు. అధికంగా అడ్మిషన్లలో జిల్లాలో మీర్‌పేట జూనియర్ కళాశాల 5వ స్థానంలో ఉండడం విశేషం. మొదటి, ద్వితీయ సంవత్సరం మొత్తం విద్యార్థులు 233 మంది ఉన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



కృష్ణవేణి (ఫైల్)

హయత్‌నగర్: భర్తకు దూరంగా ఉంటున్న ఓ మహిళ మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తట్టిఅన్నారంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివసిస్తున్న నీల కృష్ణవేణి (33) ప్రసాద్ దంపతులు ప్రవేటు ఉద్యోగస్తులు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. గత ఏడాదిన్నర క్రితం దంపతుల మధ్య మనస్పర్ధలు రావడంతో కృష్ణవేణి వైజాగ్‌లో ఉంటుంది. నెలన్నర క్రితం హౌసింగ్ బోర్డు కాలనీలోని తన ఇంటికి వచ్చింది. పది రోజుల క్రితం భర్త ఇక్కడి నుంచి మచిలీపట్నంలోని రంగనాథపురానికి వెళ్లాడు. తన భర్త తనను పట్టించుకోవడం లేదని మనస్తాపానికి గురైన కృష్ణవేణి సోమవారం రాత్రి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి: రెండ్రోజుల జైలుశిక్ష

చాదర్‌ఘాట్: అకారణంగా ఓ వ్యక్తిని తిట్టి, హెల్మెట్‌తో దాడి చేసిన వ్యక్తికి రెండ్రోజుల జైలు శిక్ష పడింది. చాదర్‌ఘాట్ సీఐ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటలోని రిలయన్స్ డిజిటల్ షాపు వద్ద ఓ దుకాణదారుడు షాపు బంద్ ఇంటికి వెళ్తుండగా లంగర్‌హౌజ్‌కు చెందిన బి.శివ రాపిడో బైక్‌పై వెళ్తూ దుకాణదారుడిని హెల్మెట్‌తో కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శివను కోర్టులో హాజరు పర్చగా, ఆరో నాంపల్లి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రెండ్రోజుల జైలు శిక్ష శిక్ష విధించింది.

ఉచితంగా నీటి కనెక్షన్లు ఇవ్వాలి

పహాడీషరీఫ్: అన్ని వర్గాల ప్రార్థనా మందిరాలకు ఉచితంగా మంచినీటి కనెక్షన్లు ఇవ్వాలని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అఫ్జల్, ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రం సర్వమతాల సమ్మేళనంగా సీఎం కేసీఆర్ అభివర్ణిస్తుంటారని.. అలాంటి మన రాష్ట్రంలో మజీద్‌లు, దేవాలయాలు, చర్చీలకు ఉచితంగా మంచినీటి కనెక్షన్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆధ్యాత్మికతకు ప్రార్థన మందిరాలకు విచ్చేసే భక్తజనం దాహం తీర్చేందుకు జలమండలి అధికారులు నిర్ణయం తీసుకోవాలన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీకి కనెక్షన్లు ఇప్పించేందుకు చైర్మన్, కమిషనర్ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళలపై దాడులకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి

మీర్‌పేట: మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. మీర్‌పేట లెనిన్‌నగర్‌లోని బాలాపూర్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహిళా సదస్సుకు రవీంద్రాచారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మహిళలపై రోజు రోజుకూ దాడులు, లైంగిక వేధింపులు పెరిగాయన్నారు. దేశానికి పతకాలు సాధించిన రెజ్లర్లపై జరిగిన లైంగిక దాడిని ఖండిస్తూ వారి పోరాటానికి ప్రజలంతా మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. అలాగే, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సదస్సుకు హాజరైన మహిళలంతా డిమాండ్ చేశారు.

కార్పొరేట్ విద్యాసంస్థల అడ్డగోలు దోపిడీ

బీజేపీ నేత శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: కార్పొరేట్ సంస్థలు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నా.. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పట్టించుకోవడం లేదని బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఆరోపించారు. సోమవారం శ్రీరాములు ఆధ్వర్యంలో గడప గడపకూ జన్ సంపర్క్ అభియాన్ యాత్రలో భాగంగా బడంగ్‌పేటలోని పలు డివిజన్‌ల్లో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. బడంగ్‌పేట చౌరస్తాలో అందెలకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అందెల మాట్లాడుతూ.. బడంగ్‌పేట కార్పొరేషన్ నుంచి పోయే నిధులు ఎక్కు వ..వచ్చే నిధులు తక్కువ అని దుయ్యబట్టారు. ప్రభుత్వ బడులు తెరిచి పక్షం రోజులు కావస్తున్న నేటికి పుస్తకాలు, దుస్తులు సరైనా మౌలిక సదుపాయాలు కల్పించడంలో మంత్రి సబితారెడ్డి విఫలమయ్యారని మండిపడ్డారు. వెంకట్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, జంగయ్య, మల్లేశ్, రమాదేవి, అనితా, శ్రీధర్‌రెడ్డి, ఇంద్రసేనా, సునిత, అమితా, మాధురి పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి



సైదాబాద్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా మలక్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. సోమవారం ఆయన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి సైదాబాద్ డివిజన్ పరిధిలోని జాకీర్ హుస్సేన్ కాలనీ, పూసలబస్తీ, సెంట్రల్‌బస్తీ, హరిజన్‌బస్తీ, మెస్కో లేన్‌లో పర్యటించారు. పలు బస్తీల్లో రహదారులు, సీవరేజీ లైన్లు, పారిశుద్ధ్యం, వీధిదీపాల విషయంలో స్థానికులు తెలిపిన సమస్యలను త్వరలో పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జాకీర్ హుస్సేన్ కాలనీ కమ్యూనిటీహాల్‌లోని బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధత్వ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే రివ్యూ మీటింగ్

మలక్‌పేట: కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ సర్కిల్-6 శానిటేషన్, ఎంటమాలజీ అధికారులతో సోమవారం ఎమ్మెల్యే బలాల రివ్యూ మీటింగ్ నిర్వహించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వ్యర్థాలను ఎత్తివేయడానికి అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం



రోడ్డుపై ధర్నా చేస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి శ్రీరామ్‌నగర్‌కాలనీ సాయిబాబా దేవాలయం పక్కన అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాల నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) టీమ్ కూల్చివేశారు. సోమవా రం ఉదయం పోలీసు బందోబస్తుతో అక్రమ నిర్మాణాన్ని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. కూల్చివేత ఘటనా స్థలానికి చేరుకున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి బాధితులకు అండగా ఉంటామంటూ రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్‌బీనగర్ కోఆర్డినేటర్ కొత్త రవీందర్‌గౌడ్ హాజరై మద్దతు పలికారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసుల సూచన మేరకు సెట్‌బ్యాక్‌తో నిర్మిస్తున్న నిర్మాణానికి అండగా ఉంటున్నానని భావించి నోటీసులు కూడా ఇవ్వకుండా కక్ష్య సాధింపుతో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదుతో కూల్చివేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నేతల అనుచరులు నిర్మాణాలపై ఫిర్యాదులు చేసి టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఒత్తిడి పెంచి నిర్మాణదారులను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ధర్నాలో నాంపల్లి రామేశ్వర్, శ్రీధర్‌గౌడ్, హరీశ్‌రెడ్డి, పల్లే గణేష్‌గౌడ్, కదారి యాదగిరియాదవ్, సాయిరాంగౌడ్, నవీన్, జయతేజ, గోపినాథ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రచారం చేయాలి



సరస్వతినగర్‌లో పాదయాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు

హస్తినాపురం: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని సరస్వతినగర్‌కాలనీ, పింఢి నారాయణ రెడ్డికాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీల్లో ఇంటింటికి బీజేపి కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల కేంద్ర ప్రభుత్వ పాలనలో ప్రజలు సురక్షితంగా ఉన్నారని, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరితమైన పాలన అందిస్తూ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, రాజేంద్రప్రసాద్, మహేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాఘవేంద్ర, గోవర్ధన్‌యాదవ్, రాజుగౌడ్, జీవన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.



అనితనాయక్‌ను సన్మానించిన హర్షవర్ధన్ జాదవ్

రైతుల సంక్షేమానికి కృషి

చాదర్‌ఘాట్: రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ జాదవ్ ఆ రాష్ట్రానికి చెందిన రైతులతో కలిసి మలక్‌పేట మార్కెట్‌లో చైర్‌పర్సన్, డైరెక్టర్‌తో కలిసి పర్యటించారు. రైతులకు గిట్టుబాటు ధరను అందిస్తున్నామని, నగర పరిధిలోని మార్కెట్లలో అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేసి అధునాతనంగా తీర్చిదిద్దుతున్నామని అనితనాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర అందించడం అభినందనీయమన్నారు. ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్- 3 కార్యదర్శి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు 6 బస్తీ దవాఖానాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



చాదర్‌ఘాట్: మహిళలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళ పేరుతో చేపట్టిన సమగ్ర మహిళ ఆరోగ్య పథకం ఈ నెల 14 నుంచి మలక్‌పేట నియోజకవర్గంలో ప్రారంభమైంది. ప్రతీ మంగళవారం బస్తీ దవాఖానాల్లో మహిళలకు వైద్యసేవలు అందించడానికి వైద్య అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం బస్తీ దవాఖానాలు ఎంపిక చేసి అందులో పూర్తి సౌకర్యాలు కల్పించారు. ఆరోగ్య మహిళ ద్వారా 18 ఏళ్లకు పైబడిన మహిళలకు మాత్రమే ప్రత్యేక వైద్యసేవలు, పరీక్షలు నిర్వహిస్తారు. మహిళలకు థైరాయిడ్, కేన్సర్ ఇతర వ్యాధుల నిర్ధారణ, రక్త, మూత్ర పరీక్షలు చేస్తారు. ప్రతీ మంగళవారం బస్తీ దవాఖానాలలో మహిళలకు ప్రత్యేకంగా ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు సైతం అందజేస్తారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజున్నీసా సూచించారు.

ఎంపికైన బస్తీ దవాఖానాలు

1. మాదన్నపేట పీహెచ్‌సీ
2. జాంబాగ్ బస్తీ దవాఖానా
3. సలీంనగర్ బస్తీ దవాఖానా
4. గడ్డిఅన్నారం బస్తీ దవాఖానా
5. ఆనంద్‌నగర్ బస్తీ దవాఖానా
6. కాలేందర్ నగర్ బస్తీ దవాఖానా

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9505507616 9912220363 9912220365